# ప్రజాశక్తి

సోమవారం 5 జూన్ 2023 | 8 పేజీలు


ఎన్‌టిఆర్


కృష్ణా




# అక్రమంగా చేపల చెరువు తవ్వకం

**ప్రజాశక్తి-తిరువూరు**

తిరువూరు మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూలో అక్రమంగా చేపల చెరువు తవ్వినా సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్లు వ్యహరిస్తున్నారు. అసలు మాకు సంబంధమేలేదని వారు మాట్లాడటం ఆశ్చర్యంగా ఉంది. లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలోని పుట్రేల-తిరువూరు రోడ్డు పక్కనే ఇరిగేషన్ శాఖకు చెందిన కుంటచెరువు


### పట్టించుకోని అధికార యంత్రాంగం

ఉంది. ఈ చెరువు కట్టకు ఆనుకుని ఐదెకరాల మాగాణీ భూమిని ఇటీవల చేపల చెరువుగా చేశారు. ప్రధాన రహదారి పక్కనే జేసీబీలతో రెండు నెలల నుండి ఏవిధమైన అనుమతులు లేకుండా చేపల చెరువు తవ్వుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్, పంచాయతీరాజ్ శాఖా అధికారులు స్పందించకకుండా వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈఅనధికార చేపల చెరువులో నీటిని నింపేందుకు ఉచిత విద్యుత్‌ను యథేచ్ఛగా ఉపయోగిస్తున్నారు. అనధికార చేపల చెరువు ఏర్పాటుపై పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈచెరువులోకి నీటికి వ్యవసాయ బోర్లను ఉపయోగిస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి తమ పొలాలకు (మిగతా 6లో)

# అంతా గందరగోళమే..

- తప్పులు తడకగా ఉపాధ్యాయుల బదిలీల జాబితా
- ఆందోళనలో ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం గత నెలలో మార్గదర్శకాలు విడుదల చేయడంతో జిల్లాలో గత కొన్ని రోజులుగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. నిబంధనలకు విరుద్ధంగా ఈ పక్రియ జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.



జీఓ ప్రకారంగా కాకుండా విద్యాశాఖ అధికారులు ఇష్టానుసారంగా జాబితాలు సిద్ధం చేసి ప్రకటించినట్లు పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీంతో అర్హులైన ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పులను సరిచేయాల్సిన విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. తుది జాబితాలో దొర్లిన తప్పులు సరిచేయకుండా బదిలీలు కౌన్సిలింగ్ నిర్వహిస్తే ఉపాధ్యాయ సంఘాలన్నీ ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నాయి. ఎప్పుడు ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టిన వివాదాలు చుట్టుముడుతుంటాయి. అలానే ఈ సారి కూడా (మిగతా 6లో)

# ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

### కృష్ణాజిల్లా అటవీశాఖ అధికారి కె.రాజశేఖరరావు






**ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్**

సముద్రంలో చెత్త, ప్లాస్టిక్ కాలుష్యంతో పర్యావరణ వ్యవస్థలలో ముప్పు పొంచి ఉందనీ, ప్రజలకు అవగాహన కల్పించటం ద్వారా నియంత్రణా చర్యల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కృష్ణాజిల్లా అటవీశాఖ అధికారి కె.రాజశేఖరరావు చెప్పారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**ప్రశ్న:** కాలుష్యానికి కారకాలు ఏమిటి?

జవాబు : ప్రపంచవ్యాప్తంగా నేడు పరిశీలిస్తే కాలుష్యం అనేక రకాలుగా పెరిగిపోతోంది. వాయు, జల కాలుష్యం ఆందోళన కల్గిస్తోంది. నానాటికీ పెరుగుతున్న జనం, తగ్గిపోతున్న అడవులు ఆందోళనకరమైన అంశాలు. బహుముఖ మన్నికైన పదార్థం ప్లాస్టిక్ మార్కెట్లోకి చొరబడింది. భూమిపై అన్నిచోట్ల ఇది వ్యాపించింది. ప్రాణాలను రక్షించే వైద్య పరికరాల నుండి సురక్షితమైన, దీర్ఘ జీవిత ఆహార నిల్వ వరకు ప్లాస్టిక్ ముఖ్యమైన ప్రయోజనాలను అందిస్తోంది. అయితే అవసరమైన నివారించదగ్గ ప్లాస్టిక్, ప్రత్యేకించి సింగిల్ యూజ్ ప్యాకేజింగ్, డిస్పోజబుల్ వస్తువులు ప్రమాదకర స్థాయికి మించి కలుషితం చేస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలతో సరస్సులు, నదులు, తీరప్రాంత పరిసరాల్లోకి చివరకు సముద్రంలోనికి పారేస్తుండటంతో జలాలు కూడా కలుషితం అవుతున్నాయి.

**ప్రశ్న:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురించి తెలుపండి?

జవాబు : వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే (డబ్ల్యుఈడి) పర్యావరణం కోసం ప్రపంచ వ్యాప్తంగా అవగాహన, చర్యలను ప్రోత్సహించడానికి ఐక్యరాజ్య సమితి ప్రధాన లక్ష్యంగా, స్టాక్ హోమ్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవానికి గుర్తుగా 1972లో మానవ పర్యావరణంపై (మిగతా 6లో)

# కౌలు రైతుల పాదయాత్రను జయప్రదం చేయండి


నందిగామలో...


వత్సవాయిలో...

**ప్రజాశక్తి-నందిగామ :** ఈ నెల 12వ తేదీన విజయవాడ నుండి మంగళగిరి వరకు జరుగు కవులు రైతుల పాదయాత్రను జయప్రదం చేయాలని కౌలు రైతులు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు పిలుపునిచ్చారు. ఆదివారం కౌలు రైతుల సంఘం పాదయాత్రను జయప్రదం చేయాలని నందిగామ మండలం కమ్మవారిపాలెం రాఘవాపురం పల్లగిరి గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు పైగా ఉన్న కౌలు రైతులకు 2019 పంట సాగు దారుల చట్టం ప్రకారం గుర్తింపు కార్డు మంజూరుకు భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధనలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో చట్టంలో మార్పులు చేసి కౌలు రైతుకు సులభంగా గుర్తింపు కార్డు మంజూరు చేయాలన్నారు. భూ యజమాని సంతకం తొలగింపు సాధనే లక్ష్యంగా కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జూన్ 5 నుండి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార జాతాలు, సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద వినతిపత్రాలు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. పంట ఋణాలు, రాయితీ ఎరువులు విత్తనాలు, పంట నష్టపోతే పరిహారం దక్కక కౌలు రైతులకు అడుగడుగునా కష్టాల సాగు తప్పడం లేదని ఎద్దేవాచేశారు. భూ యజమాని సంతకం తప్పనిసరి అయిన నేపథ్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డు రావడం లేదని భూ యజమాని సంతకంతో పని లేకుండా గ్రామ సచివాలయం రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సంయుక్తంగా గ్రామ సభలు నిర్వహించి అసలైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట ఋణాలు, భీమా, ఈ క్రాప్, రాయితీపై ఋణాలు, పంట అమ్ముకునేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని , ప్రకతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లితే పరిహారం సౌకర్యం కల్పించి కౌలు రైతుల ఆత్మహత్యలు నివారించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు ప్రధాన అంశమని దీనికి ప్రధాన ఆటంకంగా ఉన్న భూ యజమాని సంతకం తొలగించాలన్న డిమాండ్ సాధన తమ సంఘం లక్ష్యమన్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి భూ యజమాని కౌలు రైతులతో గ్రామ సభ నిర్వహించి అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఋణాలు ,బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ సాధన కోసం12 న విజయవాడ నుండి ప్రకాశం బ్యారేజీ మీదుగా మంగళగిరి సిసిఎల్ఏ కార్యాలయంకు వద్ద రాయబార పాదయాత్ర కార్యక్రమంలో కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు కటారపు విత్రలావు, వెంపటి రఘు, పుల్లయ్య, వెంకటరత్నం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-వత్సవాయి :** మండల కేంద్రమైన వత్సవాయిలో ఆదివారం కౌలు రైతుల సంఘం వత్సవాయి మండల కమిటీ సమావేశం జానకోటయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు పైగా ఉన్న కౌలు రైతులకు 2019 పంటసాగుదారుల చట్టం ప్రకారం గుర్తింపు కార్డు మంజూరుకు భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధనలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో చట్టంలో మార్పులు చేసి కౌలురైతుకు సులభంగాగుర్తింపుకార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కందుల జాను కోటయ్య, చిరుమామిళ్ల హనుమంతరావు, మాచినేనిపల్లి గ్రామం కౌలు రైతులు బాలా శ్రీనివాసరావు, కనపర్తి పుల్లయ్య, వత్సవాయి గ్రామ కౌలు రైతులు కె హనుమంతరావు, ఏసుపోగు వెంకటరత్నం పోలంపల్లి కౌలు రైతులు కనకయ్య, రమేష్, కొండయ్య, లింగాల కౌలు రైతులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు : ఒకరు మృతి



**ప్రజాశక్తి-జగ్గయ్యపేట :** ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుండి కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయినా సంఘటన మండలంలోని గౌరవరం గ్రామ సమీపంలో 65 నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు హైదరాబాదు నుండి విజయవాడ వెళుతున్న కారు గౌరవరం గ్రామం వద్ద జగ్గయ్యపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుండగా వెనుక నుండి వేగంగా వచ్చి ఆగి ఉన్న బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయవాడ కానూరుకు చెందిన అన్నే రజనీకుమారి (48) అక్కడికక్కడే మృతి చెందింది. ఒకసారి వేగంగా బస్సును కారు ఢీకొనడంతో బస్సు కిందకు కారు చోచ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న నేతాజీకి తీవ్ర గాయాలైనాయి. ఒక్కసారిగా కారు బస్సు క్రింద ఇరుక్కుపోవటంతో నేతాజీని బయటకు చేయుటకు చాలా శ్రమించాల్సి వచ్చింది. ఈ ప్రమాదంలో మతురాలి మనవరాలు కార్తికకు సైతం తీవ్ర గాయాలైనవి గాయపడిన క్షతగాత్రులను జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కొరకు విజయవాడ తరలించారు. మతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పిటల్ కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు చిల్లకల్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ తీగలు తగిలి పాడిగేదెలు మృతి

**ప్రజాశక్తి -తిరువూరు :** పోతుల చెరువులో తెగిపడిన విద్యుత్ తీగెను తగిలిన మూడు పాడి గేదెలు అక్కడికక్కడే మతి చెందిన సంఘట న తిరువూరులో ఆదివారం చోటుచేసు కుంది. పాత తిరువూరుకు చెందిన పెగ ళ్ళపాటి సీతారామయ్య చెందిన మూ డు పాడి గేదలు చెరువు మైదానంలో మేస్తున్నాయి. అదే సమయంలో తెగి నేలపై పడివున్న విద్యుత్ తీగను తాక టంతో మతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.1,50,000 ఉంటుందని యజమాని సీతారామయ్య తెలిపారు.

**విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్షమే :** గేదెల మతికి విద్యుత్ అధికారులే కారణం అని బాధితులు ఆరోపిస్తున్నాడు. పాల ద్వారా వచ్చే ఆదాయంతో తమకుటుంబం జీవనాన్ని కొనసా గిస్తుందని ఆయన బోరున విలపిస్తున్నాడు. విద్యుత్ అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

## ప్రముఖ వ్యాపారి మృతి

**ప్రజాశక్తి-నందిగామ :** నందిగామ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి కంతేటి రవి (49) అనారోగ్యంతో ఆదివారం మతి చెందారు. రవికి భార్య పిల్లలు ఉన్నారు. స్థానిక నందిగామలో ఒకప్పుడు నంది బనియన్ స్టోర్ అధినేత కంతేటి రవి కొంతకాలంగా విజయ వాడలో నివాసం ఉంటూ అనారోగ్య కారణంగా ఎన్నారై హాస్పటల్లో మత్యువుతో పోరాడి మరణించారు.

## ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ బుక్స్ పంపిణీ

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట :** పట్టణంలోని మార్కండేయ బజార్ నందు వేసవి సెలవల సందర్భంగా విద్యార్థులకు అక్షర ప్రగతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్సెస్ మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ ను ఆర్గనైజర్స్ ఏర్పాటు చేశారు. ఆదివారం పిల్లలకు శ్రీరాం రాజగోపాల్ ఏర్పాటు చేసిన స్పోకెన్ ఇంగ్లీష్ బుక్స్ పంపిణీ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ రాం సుబ్బారావు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం ధనుంజయ చినబాబు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రచ్చ శ్రీను, గోసిక శీను, గంజికొండలు, పి శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, వార్డ్ కౌన్సిలర్ సంగేపు బుజ్జి, తెదేపా నాయకులు రచ్చ రామారావు, బెతు రంగ, షేక్ మౌలాలి, పంతగి రవి, బొట్ల భద్రం, వెనేగెళ్ళ శ్రీను, ధర్మారావు, కోటా శ్రీను, రచ్చ వెంకటి తదితరులు పాల్గొన్నారు.




## ప్లాస్టిక్ అనర్థాలపై కళాకారుల ప్రచారం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

**ప్రజాశక్తి -నందిగామ :** నందిగామ పట్టణంలో ఆదివారం సింగల్ యూస్ ప్లాస్టిక్ వాడటం వల్ల వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నందిగామ పురపాలక సంఘం పరిధిలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నందిగామ మున్సిపల్ కమిషనర్ ఎస్ జయరాం ఆదేశాల మేరకు అమరావతి మిషన్ లైఫ్ గుడివాడ కళాకారుల ఆధ్వర్యంలో నందిగామ గాంధీ సెంటర్, చందర్లపాడు బస్టాండ్ సెంటర్, రైతు పేట సెంటర్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ సెంటర్లో పలు ఏరియాలలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మిషన్ అమరావతి గుడివాడ కళాకారులు రవితేజ, వీరయ్య నందిగామ మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ గురునాథం, శానిటేషన్ మేస్త్రి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరం


గంపలగూడెంలో...

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట :** కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయం నందు 28వ రోజు ఆది వారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12. గంటల వరకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంంనిర్వహించారు. ముందుగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. తర్వాత తెలుగు పద్యాలు సుమతీ శతకం, వేమన పద్యాలు, భాస్కర శతకం పద్యాలు విద్యార్థులచే చదివించి చెప్పించారు. తదుపరి డెంటల్ డాక్టర్ బొజ్జ సౌమ్య విద్యార్థులకు దంతాల పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించడం మరియు మన జగ్గయ్యపేట నీటీ వలన చిన్న పిల్లలకు దంతాలపై మచ్చలు వస్తున్నాయి కావున ఎక్కువగా క్యాలిష్యం వున్న ఆహార పదార్థాలు పాలు, గుడ్డు తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి శ్రీమతి ఆలేటి ప్రభ, గ్రంథాలయ సిబ్బంది రమేష్, సత్యవతి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గంపలగూడెం :** మండలంలోని పేనుగోలను గ్రామంలో గల గ్రంథాల యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు భాగవత కథలు మరియు బొమ్మరిల్లు కథలు చదివించి, చెప్పించారు. అనంతరం స్థానిక షిరిడి సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ పీడిత బాలల దినోత్సవం జరిగింది. బాలబాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. విశ్రాంత ఎంఈఓ ఉమ్మారెడ్డి శేసిరెడ్డి, గ్రంథాల ఇన్చార్జ్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ద్వాదశ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** స్థానిక చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత గరుడాచలస్థిత శ్రీ వేంకటేశ్వరస్వామి ద్వాదశ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, గౌరవాధ్యక్షులు బెవర సూర్యనారాయణ, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో తేదీ సహస్ర కలశ యాత్ర నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ళ సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి పొట్నూరి దుర్గాప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు ఈది ఎల్లారావు, తమ్మిన సూర్యకుమారి, కామందుల నరసింహారావు పాల్గొన్నారు.



## ఘనంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట :** పట్టణంలో ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా భారతదేశంలో మొట్టమొదటిగా గానగాంధర్వుడు ఎస్పీ బాల సుబ్రమణ్యం మృతిచెందిన వెంటనే జగ్గయ్యపేటలో ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని వారి పేరుతో సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు తెలిపారు. ఆదివారం ఎస్పీ బాలసుబ్రమణ్యం 77వ జయంతి సందర్భంగా వారి విగ్రహమునకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషం మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ రావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్ర ప్రదేశ్ వర్తక వాణిజ్య కమిటీ చైర్మన్ కొత్త పురుషోత్తం, ఎస్పీ బాలసుబ్రమణ్యం అధ్యక్షులు మీసాల బాబ్జి పాల్గొన్నారు.

## లక్ష తులసి పూజలు

**ప్రజాశక్తి -నందిగామ :** నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో ఉన్న బోధనంద స్వామి ఆశ్రమంలో ఆదివారం ఏరువాక లక్ష తులసి పూజలు నిర్వహించారు శ్రీకష్ణుని మందిరం నందు లక్ష తులసి పూజలు ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు అనంతరం ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధనంద స్వామి ట్రస్ట్ చైర్మన్ బొగ్గవరపు రామకష్ణ, రమేష్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# నేడు పర్యావరణ దినోత్సవం

## • మడ అడవుల అభివృద్ధికి మిష్టీ ప్రారంభం



**ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్ :** ప్రతి ఏడాది పర్యావరణ దినోత్సవం వచ్చిందంటే చాలు భూమి, జల, వాయు, సముద్ర కాలుష్యాన్ని అరికడదామని పర్యావరణాన్ని కాపాడదామని బీరాలు ఎందరో పలుకుతారు. సముద్రపు తీరప్రాంతాన్ని ఆనుకొని అడ్డుకట్టలా మడ అడవులు వ్యాపించి ఉండి, తరతరాలుగా సముద్రము నుంచి ఎదురయ్యే ప్రమాదాలు (గాలి తీవ్రత, తుఫాను, ఆటు పోటులు, సునామి) నుండి తీరప్రాంత గ్రామాలను ముంపు, నేలకోత నుండి కాపాడతున్నాయి. అలాంటి వాస్తవానికి కళ్ళ ముందు కనబడే మడ అడవులను ఏ ఒక్కరూ కాపాడలేని దుస్థితి. దశాబ్దాల తరబడి ఇదే దౌర్భాగ్యం ఈ ప్రాంతంలో నెలకొని ఉంది. అయితే తీరప్రాంత నివాసాలు, ప్రత్యక్ష ఆదాయాల కోసం మడ అడవుల చొరవ (మిష్టీ) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. కార్యక్రమంలో భాగంగా 5 హెక్టారుల విస్తీర్ణంలో మడ జాతి మొక్కలు పెంపకం నిమిత్తం సోమవారం బందరు శివారు గిలకలదిన్నేలో మొక్కలు నాటటం ప్రారంభిస్తారు. జిల్లాలో తీరప్రాంతంలో 12 వేల హెక్టార్లలో రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. 8 వేల హెక్టార్లలో మడ అడవులు నిండుగా విస్తరించి ఉన్నాయి. ప్లాంటేషన్స్ చేసే అవకాశం ఉన్న 4 వేల హెక్టార్లలో మడ చెట్లతో గ్యాపులు నింపుతారు. రాబోయే 5 ఏళ్ళలో మడ అడవులను విస్తరింప చేసి తీర ప్రాంత ప్రజలకు జీవనోపాధి కలిపిస్తూ, ప్రకతి వైపరీత్యాలతో ముప్పు వాటిల్లకుండా భావితరాలకు ఉపయోగకరంగా మడ అడవులు అభివద్ధి జరుగుతుంది.

**కృష్ణా వన్యప్రాణి అభయారణ్యం :** కృష్ణా, గోదావరి నది పరివాహక ప్రాంతములలో మడ అడవులు ఉన్నాయి. జిల్లాలో సుమారు 164. 63 చ.కి.మీ (రాష్ట్రములో సుమారు 582.19 చ.కి.మీ) ప్రాంతములో మడ అడవులు విస్తరించి ఉన్నాయి.

**మొక్కల, పక్షుల, జంతు సమూహాములు:** వివిధ రకాలైన ఔషధ గుణములు కలిగిన సుమారు 15 నుండి 20 రకాల మొక్కల సమూహాము ఉంది. ప్రక్షి జాతులు మడ అడవుల ప్రాంతములలో నివాసము ఏర్పరుచుకొని పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ తోడ్పడతున్నాయి. నల్లమడ, తెల్లమడ, విల్వమడ, తిల్ల, తాగర ఉరుదు, తందుగా, పొను, గుగులు వంటి మడలు ఈ ప్రాంతములో ఉన్నాయి. వీటిలో వివిధ రకాలైన కొంగలు, చెకుముకి పిట్టలు, కిక్కిరాయిలు, గ్రద్దలు నీటి కాకి, గువ్వలు తదితరాలు సుమారు 80 జాతుల పక్షలు ప్రతి సంవత్సరం ఇక్కడ విడిది చేస్తాయి. నీటికుక్కలు, నక్కలు, చేపలను వేటాడే పిల్లులు, మెప్పులు, పీతలు, రొయ్యలు మొదలగు నత్తజాతి జీవులు, మడపాములు వంటి జంతుకీటకాలకు కూడా నివాసయోగ్యంగా ఉంది.

**మడ అడవుల ప్రత్యేకత :** మడ అడవుల ఉప్పు నీటిని తట్టుకొనే వక్ష సమూహాలు. ఇవి ఉష్ణ మండల, నది ప్రవాహము సముద్రములో కలియుచోట, ఆటు పోటు, సముద్ర నీటి మట్టానికి మధ్యలోను, సముద్ర నీటి కెరటాల నుండి రక్షణ ఉన్న ప్రాంతములో అభివద్ధి చెందుతాయి. మడ అడవులు ఒక సంక్షిప్త వక్ష, జంతు సమూహారము. ఇది నీటిలోను, నేలమీద పెరిగే వక్షజంతుజాలముతో కూడినది. ఒక ప్రతేకమైన లవణ సాంద్రత కలిగిన చోట పెరిగే హరితారణ్యముగా చెప్పవచ్చు.

**మడ అడవుల ప్రాముఖ్యత :** సముద్రపు తీరప్రాంతాన్ని ఆనుకొని అడ్డుకట్టలా మడ అడవులు వ్యాపించి ఉండి, సముద్రము నుంచి ఎదురయ్యే ప్రమాదాలు (గాలి తీవ్రత, తుఫాను, ఆటు పోటులు, సునామి) నుండి తీరప్రాంత గ్రామాలను ముంపు, నేలకోత జరగకుండా కాపాడతాయి. మడలో లభ్యమయ్యే పోషకాలతో సముద్రం చేపలు, పీతలు అభివద్ధి చెందుతాయి. వలస పక్షులు గూడు కట్టుకట్టుకునేందుకు, సముద్రపు జీవులు సంతాన ఉత్పత్తికి అనువుగా ఉపయోగపడతాయి. అంతే కాకుండా సముద్రం, నదుల నుండి కొట్టుకువచ్చిన మట్టి ఇసుక మేటలు వేసి భూభాగపు శాతం పెరిగేందుకు దోహదపడతాయి. వీటి యొక్క కలపను బోటు తయారీ, ఫెన్సింగ్, వంట చెరకుగాను, చెట్టు బెరడు చర్మశుద్ధికి, ఆకులు పశుగ్రాసంగా, మత్స్యకారుల జీవనోపాధికి మడ అడవులు ఎంతగానో ఉపయోగ పడతాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ఎంతగానో దోహదపడుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న మడ అడవులు అభివద్ధి, వాటిని రక్షించుకునే బాధ్యత మన అందరిపై ఉంది.

## చేపల చెరువు నుంచి తీవ్ర దుర్వాసన



చనిపోయిన గురక చేపలు

**ప్రజాశక్తి- ఘంటసాల :** చేపల చెరువులో గురక చేపలు మృతి చెందటంతో తీవ్ర దుర్వాసన వెద జల్లుతుందని గ్రామ స్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వరస్వామివారి దేవస్థానానికి సంబంధించిన చేపల చెరువును లీజుకు ఇచ్చారు. సుమారు ఐదు ఎకరాలకుపైగా ఉన్న ఈ చేపల చెరువులో లీజు దారుడు చేపల సాగు చేపట్టాడు. గత నాలుగు రోజుల క్రితం చేపల చెరువులో గురకలు మతి చెంది చెరువులో తేలియాడుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో ఆవాస ముండే ప్రజలు చనిపోయిన చేపల దుర్వాసన భరించలేక ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం రహదారి వెంబడి కూడా నడవలేని స్థితిలో ముక్కు మూసుకుని వాహనదారులు వెళ్తున్నారు. చేపలను తిని వేసే గురకలకు మందు వేయటం ద్వారా అవి మతి చెందుతాయని, కనీసం వాటిని తొలగించాల్సిన బాధ్యత లీజు దారుడికి ఉన్నా పట్టించుకుని ప్రజలు వాపోతున్నారు. తక్షణమే దేవస్థానంకు సంబంధించిన అధికారులు స్పందించి లీజుదారుడితో మాట్లాడి చనిపోయి దుర్వాసన వెదజల్లుతున్న గురక చేపలను తొలగించాలని కోరుతున్నారు.

## చల్లపల్లిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'



సమస్యలు వింటున్న ఎంఎల్ఎ రమేష్‌బాబు

**ప్రజాశక్తి-చల్లపల్లి :** చంద్రబాబు ఎన్నికల హామీలు ఏ విధంగా అమలు చేస్తారో రాష్ట్ర ప్రజలకు తెలుసనీ అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చల్లపల్లి గ్రామ సచివాలయం - 4 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం ఆదివారం కార్యక్రమం జరిగింది. శాసనసభ్యులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరాలను లబ్ధిదారులకు వివరిస్తూ సంక్షేమ పథకాలు అందరికీ అందుతుంది లేనిది అడిగి వివరాలు తీసుకున్నారు అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రోజునే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీలు అమలుపరిచారని అన్నారు. గతంలో చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇప్పుడు గుర్తుకొచ్చాయయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఓటమి భయముతోనే అమలుకు సాధ్యం కానీ పథకాలను మేనిఫెస్టో ప్రకటించి మరోసారి ప్రజలు మోసం చేసేందుకు చంద్రబాబు నాయుడు సిద్ధపడుతున్నారన్నారు. చంద్రబాబును నమ్మి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని జ్యోతిష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ పార్టీ ఇంచార్జ్ ఇంకొల్లు శేషగిరిరావు, చల్లపల్లి పిఎసిఎస్ చైర్ పర్సన్ పాగోలు ఫణి, వెనిగళ్ళ జగదీష్, యడ్ల జగదీష్, ఎంపీటీసీ సభ్యులు ద్వారకనాథ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు

## ఉత్తమ ఫలితాల సాధించిన విద్యార్థులకు సన్మానం



**ప్రజాశక్తి-చల్లపల్లి :** జీవితంలో కష్టపడి చదివితే విజయం తథ్యమనీ, భవిష్యత్తుకు మంచి ప్రణాళికలు వేసుకుని విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అవనిగడ్డ డీఎస్పీ కె.మురళీధర్ తెలిపారు. చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థుల అసోసియేషన్(1987- 2020 బ్యాచ్) ఆధ్వర్యంలో చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమస్థానం సాధించిన 23మంది విద్యార్థినీ, విద్యార్థులకు సన్మాన కార్యక్రమం స్థానిక శ్రీఆర్యవైశ్య సంఘ భవనంలో ఆదివారం జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులను తల్లిదండ్రులతో కలిసి సన్మానించి, రూ.రెండు వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి, జ్ఞాపికలు అందచేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేలా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కృష్ణాజిల్లా ఎందరో మహనీయులకు పుట్టినిల్లన్నారు. కృష్ణాజిల్లా నుంచీ సుప్రీంకోర్టు సీజేఐగా ఎదిగిన జస్టిస్ ఎన్ వి.రమణ, న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, ఐఏఎస్ అధికారి రేవు ముత్యాలరాజుల గురించి వివరించారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలని కోరారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించుకోవాలని సూచించారు. ఇంటర్ విద్యార్థులు తమ దష్టిని కేవలం చదువు, లక్ష్యసాధన పైనే ఉంచాలన్నారు. విజయవాడ పీబీ.సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ మేకా రమేష్ మాట్లాడుతూ లక్ష్యసాధనకు కఠినంగా శ్రమించాలనీ, ఒకవేళ లక్ష్యాన్ని సాధించలేకపోయినా ఎప్పటికీ నిరాశ చెందకుండా ప్రయత్నం కొనసాగించాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు పర్యవేక్షణ, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు జి.ఆశ్వినీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బీడీఆర్, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఎండి.ఎకె.జిలానీ, కొండవీటి నాగరాజు, సిహెచ్.అనిల్, పాగోలు దుర్గాప్రసాద్, ఉప్పాల నాంచారయ్య, సుభాషిణి, రావి రాజశేఖర్, సాయికుమారి, ఓగిరాల నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఆర్యవైశ్య ప్రముఖులు కొల్లిపర మధు, వరదా హరిగోపాల్, తమ్మన సతీష్ కుమార్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మూడు మండలాల్లో మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ నేత కొల్లిపర మధు రూ.1000 చొప్పున నగదు బహుమతి అందించారు.

## చిన్న సేవలు ఆదర్శనీయం : బుద్ధప్రసాద్



**ప్రజాశక్తి- ఘంటసాల :** ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో రాష్ట్ర తెలుగు యువత నాయకులు, శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న) సహకారంతో కరకట్టపై 20 వేల రూపాయలతో ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన తాటాకు పాకను, చలివేంద్రాన్ని మరియు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ శ్రీకాకుళం గ్రామంలో తాడికొండ చిన్న, వారి మిత్ర బందం సహకారంతో పాదాచారులు, వాహనదారులు, ప్రయాణికులు మరియు పరిసరప్రాంత ప్రజలు తాగునీటి కోసం ఎటువంటి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ, మంచినీటి చలివేంద్రంను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో చిన్న మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని బుద్ధ ప్రసాద్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, శీలం అశ్విని, జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం, అచ్చెపాలెం సర్పంచ్లు ముప్పనేని రవిప్రసాద్, గాజుల శ్రీనివాసరావు, కుంపటి చిట్టిబాబు, దాసం రామకష్ణ, కోడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కొవ్వొత్తుల ప్రదర్శన



**ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** ఒరిస్సా రైలు ప్రమాదంలో మత్యు వాత పడిన అమరులకు ఆత్మ శాంతి కలగాలని కోరుతూ తోట్ల వల్లూరు మండలం తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రైలు ప్రమాదంలో మత్యువాత పడిన వారికి కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ సాయం అందించాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రమాద బాధిత కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు. అమరుల ఆత్మ శాంతి కలగాలని కోరుతూ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నేక్కలపూడి మురళి , గారిపర్తి పోతురాజు, వీరంకి నాగర్జున, వల్లూరు రాంబాబు, వీరికి కృష్ణ, వల్లూరు రమేష్, ఆకునూరు బాబురావు, డొక్కు నాగయ్య, గోలి వెంకటేశ్వర్లు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చాప్టర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం

**ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ :** స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలోని బందరుకోట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చాప్టర్ ఇంటర్నేషనల్ స్కూలును మాజీ మంత్రి, బందరు శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదివారం ప్రారంభించారు. స్కూలులో ఏర్పాటు చేసిన తరగతి గదులు, క్రీడాస్థలం పరిశీలించి స్కూల్ యాజమాన్యం తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యూత్ జోనల్ ఇంచార్జి పేర్ని కిట్టు, మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, ముడా చైర్మన్ బొర్రా నాగలక్ష్మి దుర్గాభవానీ, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ సలార్ దాదా, మాజీ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బొర్రా విఠల్, స్కూల్ చైర్మన్ మామిడి వెంకటేశ్వరావు, ప్రిన్సిపాల్ మామిడి సుజన్, సెక్రటరీ మామిడి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాశక్తి-చల్లపల్లి :** మెట్లు దిగుతూ అదుపుతప్పి పడిపోవడంతో చిట్లిన ఎముక చికిత్స అనంతరం విశ్రాంతి పొందుతున్న ఏపీ టీఎస్ ఛానల్ రిపోర్టర్ పేరం చంద్రశేఖర్ రెడ్డిని ఆదివారం రామానగరంలో ఆయన స్వగహం నందు అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పరామర్శించారు. ఆయన వెంట వైసీపీ సీనియర్ నేత, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, సచివాలయాల కన్వీనర్ యడ్ల జగదీష్, స్థానిక వైసీపీ నేతలు పాల్గొన్నారు.

# ప్రకృతి వనరులు కాపాడుకోవడం అందరి బాధ్యత

**ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం :** అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కొండపల్లి ఖిల్లాపై గత కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్త, చెదారం, ప్లాస్టిక్ వ్యర్ధాల తొలగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీ, పర్యావరణం, సాంకేతిక రంగ శాఖ ప్రత్యేక కార్యదర్శి పి. చలపతిరావు, (ఐఎఫ్ఎస్) పాల్గొని మాట్లాడుతూ పురాతన కాలం నుంచి పంచభూతాలుగా మానవాళికి వారసత్వంగా సంక్రమించిన గాలి, భూమి, నీరు, ఆకాశం, అగ్ని వంటి ప్రకతి వనరులను కాపాడుకోవడంతో పాటు మన పూర్వీకుల నుంచి మనకు లభించిన పర్యావరణ స్థితిని మనం కూడా మన తర్వాతి తరాలకు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని అన్నారు. ప్రకతిలో భాగమైన వక్షాలను సంరక్షించడం ద్వారా పరిశుభ్రమైన గాలి అందరికీ లభిస్తుందన్నారు. అలాగే సకాలంలో వర్షాలు పడాలన్నా వక్ష సంపదను కాపాడుకోవాలన్నారు. సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న వ్యాపార ధోరణి వల్ల ఎక్కువగా నష్టపోతోంది ప్రకతి వనరులేనన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితులను అధిగమించి ప్రతి ఒక్కరూ ప్రకతి పరిరక్షణ కోసం సామాజిక బాధ్యతగా ప్రకతి వనరులను కాపాడుకోవా లన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీ అప్పన్న మాట్లాడుతూ ఇటువంటి ప్రక్షాళన కార్యక్రమాలు ప్రతి చారిత్రక ప్రదేశంలో జరగాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ సామాజిక సేవ అనే పదానికి ఉన్న అర్థం ప్రకతి వనరులను కాపాడుకోవడమేనని చెప్పారు. నేడు మనం తింటున్న ఆహారం, గాలి, నీరు కలుషితంగా మారితే సమాజం మొత్తం అనారోగ్యం బారిన పడుతుందన్నారు. ఎవరికివారు తమకెందుకులే అని నిర్లక్ష్యం వహిస్తే అంతిమంగా అందరం నష్టపోతామని గ్రహించాలని



పేర్కొన్నారు. ఈసందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులతో ప్రకతిని పరిరక్షిస్తామని ముఖ్య అతిథులు ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో విజయవాడ అడ్వెంచర్స్ క్లబ్ రఘునాధ రెడ్డి, కొండపల్లి ఐలా కమిషనర్ సాంబశివరావు, ఏపీ ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎండి ఇక్బాల్, భద్రత బాధ్యత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎస్. శ్రీనివాసరావు, జిల్లా ఎన్జీవో నాయకులు సతీష్ కుమార్, రాజబాబు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

## కేంద్ర జలశక్తి మిషన్ కార్యదర్శి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం :** కేంద్ర జలశక్తి మిషన్ కార్యదర్శి విని మహాజన్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తిచేసి సిద్ధంగా ఉండా లని జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు అన్నారు. జూన్ 6న కేంద్ర జల శక్తి మిషన్ కార్యదర్శి పర్యటన సందర్భంగా కలెక్టర్ ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం జూపూడి, మైలవరం మండలం పొందుగల గ్రామాలలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీ రావు మాట్లాడుతూ కేంద్ర జలశక్తి మిషన్ కార్యదర్శి విని మహాజన్ ఈనెల ఆరవ తేదీ మంగళవారం జిల్లాలోని జూపూడి, పొందుగల గ్రామాలలో పర్యటించనున్నారన్నారు. ముందుగా జూపూడి లో గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ పనితీరు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు (సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్) పొందుగల గ్రామంలో సురక్షిత తాగునీరు, డ్రైనేజ్, పారిశుద్ధ్య వ్యవస్థ పనితీరు తదితర అంశాలను సందర్శించనున్నారు. కేంద్ర జల శక్తి కార్యదర్శి ఆయా గ్రామాల్లో పర్యటించే సందర్భంలో పారిశుద్ధ్య, సురక్షిత మంచినీరు లభ్యత అంశాలు, సచివాలయ ఉద్యోగులతో ముఖాముఖిగా మాట్లాడతారని చెప్పారు. ఆయా గ్రామాల్లో కేంద్ర నిధులతో చేపట్టిన పథకాల కార్యక్రమాల నివేదికను తయారుచేసి సిద్ధంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ఆదేశించారు. ఏర్పాట్ల పరిశీలనలో జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు తో పాటు జిల్లా పంచాయతీ అధికారి జే సునీత ఉన్నారు.

## గంపలగూడెం చేరుకున్న జగనన్న విద్యా కానుక కిట్లు

**ప్రజాశక్తి - గంపలగూడెం :** జగనన్న విద్యా కానుక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అందించే షూస్ గంపలగూడెం వచ్చాయి. గంపలగూడెం హైస్కూల్‌లో ఆరు మండలాలకు సంబంధించిన స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసుకున్నారు .జగ్గయ్యపేట, పెనుగం చిప్రోలు, నందిగామ, వత్సవాయి, తిరువూరు, గంపలగూడెం మండలాలకు సంబంధించిన షూస్ బాక్స్ లు వచ్చాయి. మండలానికి 4,821 మంది విద్యార్థులకు షూస్ అవసరం కాగా, ఆదివారం 2,736 షూస్ వచ్చాయి. తదుపరి విడతలో పూర్తి స్థాయిలో వస్తాయని ఎంఈఓ సోమశేఖర్ నాయక్ తెలిపారు.

## రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ

**ప్రజాశక్తి నందిగామ :** రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో నందిగామ కాకతీయ హెల్త్ క్లబ్ స్విమ్మింగ్ అకాడమీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ నెల 2, 3.వ తేదీలలో స్విమ్మింగ్ పోటీలను హైదరాబాదులో యూత్ స్విమ్మింగ్ ఛాంపియన్ వారు నిర్వహించిన పోటీలలో 300కు పైగా విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ పోటీలలో నందిగామ కాకతీయ అపోలో స్కూల్ కి చెందిన బి.వరుణ్ సాయి అండర్ 15 విభాగంలో ప్రథమ స్థానం అదేవిధంగా ఇదే విద్యార్థి బ్యాక్ స్ట్రోక్ విభాగంలో తతీయ స్థానాన్ని సాధించాడు. ఎసి.కీర్తన్ అనే విద్యార్థి 25మీటర్స్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని, కిక్ బోర్డు విభాగంలో తతీయ స్థానాన్ని సాధించాడు. నవదీప్ అనే విద్యార్థి 25మీటర్స్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించాడు.అంతేకాకుండా ఇదే విభాగంలో సాయి ఫణి సాత్విక్ తతీయ స్థానాన్ని సాధించాడు. ఈ పోటీలకు నందిగామ కాకతీయ హెల్త్ క్లబ్ అకాడమీ విద్యార్థులు 8 మంది పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచారు. విజేతలైన విద్యార్థులను డైరెక్టర్ కాపా కార్తికేయ, స్విమ్మింగ్ కోచ్ గోపీచంద్ అభినందించారు.





## కొండపల్లి కోటను సందర్శించిన ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

**ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం :** కర్నులు నగర ఎమ్మెల్యే మొహమ్మద్ అబ్దుల్ హఫీజ్ ఖాన్ కొండపల్లి కోటను సందర్శించారు. కోటలోని ఎగ్జిబిషన్ గ్యాలరీలో అంశాలను నిశితంగా పరిశిలించారు. కొండపల్లి కోటలో పర్యాటక శాఖ ఎర్పాటు చేసిన లేజర్ షోను తిలకించారు. ఇక్కడి లేజర్ షోగురించి తెలుసుకుని చూడటానికి వచ్చానన్నారు. ఇదే మాదిరిగా కర్నూలు కొండారెడ్డి బురుజు కోటలో లేజర్ షోను ఏర్పాటు చేయడానికి అలోచన చేస్తున్నామన్నారు.

# జగ్గయ్యపేట టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తా

- రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ యువతకు 40 శాతం సీట్లు ఇస్తామంటూ యువనేత నారా లోకేష్ ప్రకటించిన నేపథ్యంలో రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని శాంతినగర్ లో తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం దుష్టపాలన చేస్తుందని, గత సర్పంచ్ ఎన్నికల్లో తన గ్రామం తాళ్లూరులో సర్పంచ్‌గా తన తల్లినీ, ఎంపీటీసీగా తన తండ్రినీ నిలబెట్టానని, అప్పటినుంచి రాజకీయంగా ఎదుర్కొనలేక స్థానిక శాసనసభ్యులు తనపై అనేక కేసులు పెట్టి జైల్లో పెట్టారని, అన్నిటికి నిలబడి తాను నియోజకవర్గంలో సేవ చేస్తున్నట్లు తెలిపారు. తాను 29 రాష్ట్రాల్లో వ్యాపారు లావాదేవీలు చేస్తూ, 25 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని, నెలకి 60 కోట్ల రూపాయలు టర్నోవర్‌తో,



నెలకు 11 కోట్ల రూపాయలు జీఎస్టీ చెల్లిస్తున్నాను అన్నారు. ఎక్కడ కూడా రాజీ పడకుండా పార్టీకి సేవ చేస్తున్న తనపై స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకత్వం తనను అనేక విధాలుగా ఇబ్బందులు గురి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామినేని వెంకటేశ్వరరావు, అన్నేపాక సుందర్రావు, అన్నేపాగ కిషోర్ బాబు, రావురి శ్రీనివాసరావు, రావూరి విశ్వనాథం, న్యాయవాది స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# దేవినేని రమణకు ఘననివాళి

**ప్రజాశక్తి-కంచికచర్ల :** నందిగామ నియోజకవర్గంలో తాగు, సాగు నీరు అందించిన మాజీ మంత్రి దేవినేని రమణ ప్రజల హదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఆయన సోదరుడు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కొనియాడారు. మాజీ మంత్రి దేవినేని రమణ 24 వ వర్ధంతి ని మండల టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం కంచికచర్ల మండలం లో ఘనంగా నిర్వహించారు. కంచికచర్ల సమీపంలో గల దేవినేని రమణ, ప్రణీత ఘాట్‌కు దేవినేని ఉమ, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక టిడిపి కార్యాలయంలో రమణ, ప్రణీత చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడుతూ నందిగామ ఎమ్మెల్యే గా, మంత్రి గా కేవలం నాలుగేళ్ళలో ఈ ప్రాంతంలో సాగు నీరు తాగునీరు అందించిన ఘనత రమణకే దక్కిందన్నారు. ఆయన భౌతికంగా దూరమై 24 ఏళ్ళు గడిచినా, ఆయన చేసిన అభివద్ధి ఇప్పటికీ కళ్ళకు కనబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, మహిళా అధ్యక్షురాలు మన్నే సాత్విక, మాజీ ఎంపిపి అల్లడి కోటేశ్వరరావు, నాయకులు గుత్తా రత్నం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి, నాయకులు రొంపిచర్ల శ్యాం, వేమా వెంకట్రావు, అన్నదాత రామకష్ణ పాల్గొన్నారు. అలాగే స్థానిక చెవిటికల్లు రోడ్డు సెంటర్ లో గల రమణ విగ్రహానికి పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని పరిటాల రమణ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రమణ విగ్రహానికి మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు మాజీ ఎంపిపి పరిటాల భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ తంగిరాల పద్మ, మాగంటి బాబు, నాయకులు మాగంటి పుల్లారావు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అన్నదానం చేశారు. గనిఆత్కూరు గ్రామంలో నాయకులు వెంపరాల వెంకటేశ్వరరావు, మూరకొండ ఏడు కొండలు, తదితరులు రమణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గొట్టుముక్కల గ్రామంలో దేవినేని రమణ విగ్రహానికి సర్పంచ్ తుల్లిమిల్లి రాజ్ కుమార్, ఉప సర్పంచ్ గోగినేని శ్రీనివాసరావు, అమర్ నాథ్, తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కీసర, గండేపల్లి, మోగులూరు, వేములపల్లి, పేరకలపాడు గ్రామాల్లో దేవినేని రమణ వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. **ప్రజాశక్తి - నందిగామ :** దేవినేని వెంకటరమణ వర్ధంతి వేడుకలు ఆదివారం నందిగామలో నిర్వహించారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సమయాలు రమణ విగ్రహ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నందిగామ గాంధీ సెంటర్లో అన్నదానం నిర్వహించారు.అలాగే హనుమంతుపాలెంలో మాజీ మంత్రి స్వర్గీయ దేవినేని వెంకటరమణ, ప్రణీత వర్ధంతి వేడుకలు నిర్వహించారు. 19 వ వార్డు హనుమంతుపాలెం సెంటర్ లో యన్టీఆర్ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు గాడిపర్తి రామకష్ణ ఆధ్వర్యం లో అభిమానులు, నాయకులు, కార్యకర్తల తో కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో నందిగామ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏచూరి రాము,పట్టణ ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీ నారాయణ, గ్రామ అధ్యక్షులు బుల్లి అబ్బాయి, గాడిపర్తి భీమయ్య పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం :** కొండపల్లి మున్సిపాలిటీ ఇబ్రహీంపట్నం సహాయమాత స్కూల్ నందు మాజీ మంత్రివర్యులు దేవినేని వెంకటరమణ 24వ వర్ధంతి కార్యక్రమం మండల తెలుగుదేశం పార్టీ



కంచికచర్లలో...



నందిగామలో...



ఇబ్రహీంపట్నంలో...

ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రమణ చిత్రపటానికి రాష్ట్ర పార్టీ మాజీ కార్యదర్శి జంపాల సీతారామయ్య, ఇబ్రహీంపట్నం మండల తెలుగుదేశం పార్టి అధ్యక్షులు రామినేని రాజశేఖర్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో షేక్ మహబూబ్ సుభాని,కూచిపూడి దిలీప్ కుమార్, ప్రభాకర్ భయ్యా రామోజీ, బొక్కినాల బెనర్జీ,నల్లమోతు సుందరం,డాక్టర్ వల్లూరు జనార్ధన స్వామిదాస్, కోటేశ్వరరావు, జమన్ జ్యోతి మోహన్ పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : టిడిపి

## పలుచోట్ల ఏరువాక కార్యక్రమాలు ప్రారంభం

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్**

రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం తెలుగుదేశం ప్రభుత్వంలోనే సాధ్యమవుతాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర వెల్లడించారు. మచిలీపట్నం మండలం చిన్నాపురంలో టిడిపి ఆధ్వర్యంలో మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ తో కలిసి ఆయన పొలంలో దుక్కి దున్ని ఏరువాకను ప్రారభించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు త్వరలో రైతు ప్రభుత్వాన్ని స్థాపించి రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించనున్నారన్నారు. ఇప్పటికే మహానాడులో రైతులకు ఆర్థికపరమైన భరోసాను ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి రూపంలో ఇస్తానని ప్రకటించారన్నారు. రాబోయే దసరాకు పూర్తిస్థాయిలో రైతు మేనిఫెస్టో ప్రకటించి రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపిపి. కాగిత వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, సర్పంచ్ గోపాల రావు, క్లస్టర్ ఇంఛార్జి లంకే శేష గిరి రావు, తలారి సోమ శేఖర్, వక్కపట్ల శ్రీనివాస్, గుమ్మడి విద్యాసాగర్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, మహిళా అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ, కరెడ్ల సుశీల, నాగ రమేష్, రాజులపాటి సత్యనారాయణ, లుక్కా సాయిరాం గౌడ్, బసయ్య, అనిశెట్టి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.


మచిలీపట్నం రూరల్ మండలంలో


గుడివాడ రూరల్ మండలంలో

**గుడివాడ :** రైతు బాగుంటేనే దేశం, రాష్ట్రం బాగుటుందనీ, వైసీపీ ప్రభుత్వం పౌర్ణమి ఏరువాకను పూర్తిగా వదిలి రైతులను పూర్తిగా విస్మరిస్తోందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు విమర్శించారు. గుడివాడ రూరల్ మండలంలోని బోమ్ములూరు గ్రామంలో పౌర్ణమి ఏరువాక సందర్భంగా రైతు సోదరులకు ఏరువాక శుభాకాంక్షలను తెలిపి వ్యవసాయ పరికరాలకు ప్రతేక పూజలు చేసి పనులు ప్రారంభం చేశారు. రూరల్ మండల అధ్యక్షులు వాసే మురళి, ప్రధాన కార్యదర్శి అంగడాల వీర్రాజు, నాయకులు శొంఠి నాగేశ్వరరావు, అంగడాల శ్రీను, అట్లూరి రమణప్రసాద్, చంద్రాల చిట్టిబాబు, గోర్జి సత్యనారాయణ, గోకవరపు సునీల్ పంద్రాజు సాంబశివరావు, పాలాసి ఉమా, దారపురెడ్డి మణేశ్వరరావు, రెడ్డి అప్పారావు, మధ్యాహ్న నాగరాజు, వసంతవాడ దుర్గారావు, కంచర్ల సుధాకర్ ,శొంటి రామకష్ణ, షేక్ జానీషరీఫ్, మోహన్, మంగరాజు, పాండు, జగన్, గోవాడ శివ, నేరుసు కాశి, రెడ్డిషణ్ముఖ, సయ్యద్ జబీన్, దొండపాటి మహేష్, నున్న పృధ్వీతేజ తదితరులు పాల్గొన్నారు.

**పమిడిముక్కల :** పమిడిముక్కల మండలంలోని వీరంకులాకులు గ్రామంలో ఏరువాకను టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల కుమార్‌రాజా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, జక్కా శ్రీనివాసరావు, మోటూరు వెంకటసుబ్బయ్య, రామారావు, కొల్లూరు బాబ్జి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పమిడిముక్కల మండలంలో

## నందీశ్వరునికి పూజలు

**ప్రజాశక్తి-ఉయ్యూరు**

ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక శ్రీజగదంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సోమేశ్వరస్వామి సన్నిధిలో ఉన్న నందీశ్వర విగ్రహానికి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో పంచామృతాల అభిషేకాలు చేసి హారుతులిచ్చారు. ఆలయ చైర్మన్ చిందా వీర వెంకట కుబరాజు ఝాన్సీరాణి దంపతులు, కమిటీ సభ్యులు, భక్తులతో కలసి అభిషేకాలు చేశారు. కమిటీ సభ్యులు అర్జునరావు, గోన కృష్ణకుమారి త దితరులు పూజలు చేశారు. గండిగుంటలో భూషయ్య గోశాల (ఆర్గానిక్ డెయిరీ పామ్)లో రావ్ అండ్ రావ్ టైర్ అధినేత, గోంసరక్షకుడు వల్లభనేని నాగభూషణరావు (భూషయ్య)కు చెందిన ఆవు రెండు ఆడ ఆ వుదూడలకు జన్మనిచ్చింది.




## మిరప శాంతమ్మ కుటుంబానికి పరామర్శ



**ప్రజాశక్తి-గన్నవరం**

సిపిఎం గన్నవరం పట్టణ కార్యదర్శి మిరప నాగేశ్వరరావు తల్లి శాంతమ్మ జ్ఞాపకార్థ కూడిక శనివారం జరిగింది. తొలుత ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే వంశీ, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, పట్టణానికి చెందిన పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు పూలమాలు వేసి నివాళు లర్పించారు. మిరప నారాయణ, మిరప స్టాలిన్, యశోద కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కామేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ వంశీ

## ఆదర్శప్రాయుడు దాసరి కామేశ్వరరావు : వంశీ

**ప్రజాశక్తి-గన్నవరం**

జర్నలిస్టు విలువలను పాటిస్తూ సమాజానికి మేలు చేయాలని ఉద్దేశంతో అనేక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేసిన దాసరి కామేశ్వరరావు ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ నున్న గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు దాసరి కామేశ్వరరావు సంస్మరణ సభ ఆదివారం జరిగింది. పలువురు ప్రముఖులు హాజరై కామేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గన్నవరం శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ మాట్లాడుతూ రాగ, ద్వేషాలకు అతీతంగా దాసరి కామేశ్వరరావు ఆదర్శ జర్నలిస్టుగా పనిచేశారన్నారు. సమాజం గురించి మంచి బాధ్యత కలిగిన వ్యక్తిగా పనిచేశారన్నారు. జర్నలిస్టుల విలువల కోసం నిరంతరం పరిశ్రమించేవారని గుర్తుచేశారు. అలాంటి మంచి వ్యక్తిని కోల్పోవటం బాధాకరమన్నారు. గత 35 ఏళ్ళుగా వివిధ ప్రతికల్లో జర్నలిస్టుగా సమాజానికి విశిష్ట సేవలందించారని ప్రముఖులు శివరామిరెడ్డి, యర్కారెడ్డి నాగిరెడ్డి, ముత్తారెడ్డి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎపిడబ్ల్యుజెఎఫ్ కృష్ణాజిల్లా కార్యదర్శి వై.శ్రీనివాసరావు, గ్రామీణ జర్నలిస్టుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్‌కె లాల్ అహ్మద్‌గౌస్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై నాయకుడిగా సమరశీలంగా పనిచేశారని గుర్తుచేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఆంజనేయులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న శ్రీనివాస్, గౌస్

## రైలు ప్రమాద మృతులకు సిపిఎం కొవ్వొత్తులతో నివాళి

**ప్రజాశక్తి - గుడివాడ**

ఒరిస్సా రైలు ప్రమాదంలో మృతులకు సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొలతో నివాళులర్పించారు. రైలు ప్రమాదానికి కేంద్రప్రభుత్వమే కారణమని ఆరోపిస్తూ గుడివాడ రైల్వే స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. సిపిఎం పట్టణ కార్యదర్శి




ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ రైల్వేశాఖ పరిధిలో దేశవ్యాప్తంగా మూడు లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉంటున్నా కేంద్రప్రభుత్వం భర్తీకి చర్యలు తీసుకోవటం లేదన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోగా పని భారాన్ని పెంచి సిగ్నల్ వ్యవస్థను సరిగ్గా పని చేయకుండా ఉండేందుకు కారణమైందన్నారు. సిగ్నల్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతోనే రైలు ప్రమాదం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా మోడీ వందే భారత్ రైలు పేరుతో ప్రచారం చేస్తున్నారన్నారు. సిబ్బంది ఖాళీలు, ప్రయివేటీకరణ వల్ల దుష్పరిణామాలు, తప్ప రైల్వే పట్టాలు సరిగా ఉన్నాయా? లేదా? వంటివి పట్టించుకున్న పాపాన పోవటం లేదన్నారు. సిగ్నల్ వ్యవస్థను పర్యవేక్షించే పోస్టులు కూడా వేలాదిగా ఖాళీలు ఉన్నాయన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ రైల్వేశాఖను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. తద్వారా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు యేసుపోగు యసయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రేపాని కొండ, ఉపతల ఏడుకొండలు, ముసలయ్య, ఆగమన రాజు, షౌకాతున్నీసా, ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజిని తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా చండీయాగం

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు**

మండలంలోని వేమవరం గ్రామంలోని శ్రీ కొండాలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. జేష్ట మాస పౌర్ణమి సందర్భంగా అమ్మవారి సన్నిధిలో చండీ హోమం నిర్వహించినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి 30 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులు తెచ్చుకున్నారు. అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం గోపి, ధర్మకర్తల మండలి సభ్యులు పామర్తి వెంకటస్వామి దంపతులు, కొమ్మనబోయిన రవిశంకర్ దంపతులు, గుడివాడ వైసిపి నాయకులు గోర్ల శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## మొదటిపేజీ తరువాయి

# అక్రమంగా చేపల చెరువు తవ్వకం

సాగునీరు అందే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనితో పాటు పక్కనున్న కుంట చెరువు ఆయకట్టు సాగుకు పనికిరాకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అనుమతి ఎవరిచ్చారనేది గోప్యం**

గ్రామీణ ప్రాంతాల్లో చేపల చెరువులను ఏర్పాటు చేయాలంటే మత్స్య శాఖ, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఇరిగేషన్, భూగర్భ, విద్యుత్ తదితర శాఖల అనుమతులు తీసుకోవాలి. అయితే ఈచెరువు ఏర్పాటుకు ఆయా శాఖల అధికారులను ప్రజాశక్తి ప్రశ్నించగా చేపల చెరువా! ఎక్కడ తవ్వారు, అనుమతి మేము కాదు, పంచాయతీ వాళ్ళు ఇస్తారని తహశీల్దార్ చెప్పటం, పంచాయతీ మండల విస్తరణ అధికారిణిని అడిగితే ముందు మేము కాదు, ఫిషరీస్, ఇరిగేషన్ అధికారులు ఇవ్వాలని ఇలా ఒకరిపై ఒకరు చెప్పారే గాని, మేము విచారణ జరుపుతామని ఏఒక్క అధికారి కూడా చెప్పకపోవటం కొసమెరుపు. ఫిషరీస్ డివిజన్ అధికారి అసలు తిరువూరు రావటమే మానేశారనీ, ఎక్కువ రోజులు సెలవుల్లో ఉంటున్నారనీ, ఏవో కుంటి సాకులు చెబుతూ పట్టించుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా చేపల చెరువులు తవ్వి సాగుచేస్తున్న వ్యక్తిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# అంతా గందరగోళమే..

బదిలీల జాబితా లో అనేక తప్పులు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సజావుగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సిన విద్యాశాఖాధికారులు అవేమీ పట్టించుకోకుండా ఒకరిద్దరి కి ఈ ప్రక్రియ అప్పజెప్పడంతో వారు తమ ఇష్టాను సారంగా కావాల్సిన వారికి అవసరమైన మార్కులు కలిపి జాబితా సిద్ధం చేసినట్లు పెద్ద ఎత్తున విమర్శలు వినబడుతున్నాయి.

కృష్ణాజిల్లాలో ప్రారంభమైన ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి జిల్లా విద్యాశాఖలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యాశాఖ అధికారులు ప్రకటించిన తుది జాబితా అంతా తప్పులు తడకగా ఉన్నట్లు పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. తప్పులను సరి చేయాల్సిన విద్యాశాఖ అధికారులు, సిబ్బంది వాటిని పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో అర్హులైన ఉపాధ్యాయులు నష్ట పోతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం గత నెల 22వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం మే 30వ తేదీ వరకు బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి.ఈ ప్రక్రియ లో బాగంగా మే 24 నుండి 26 వరకు అర్హులైన ఉపాధ్యాయులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. 25 నుండి 27 వరకు పరిశీలన ప్రక్రియ జరిగింది. 28 ,29 తేదీలలో తాత్కాలిక సీనియార్టీ జాబితా ప్రకటించాల్సి ఉంది. 30, 31 తేదీల్లో వీటిపై అభ్యంతరాలు స్వీకరించి, తప్పులను సరిచేసి ఈనెల 2,3 తేదీల్లో తుది సీనియార్టీ జాబితా ప్రకటించాల్సి ఉంది. నాలుగో తేదీన ఖాళీలు జాబితా ప్రకటించాల్సి ఉంది. 5 నుండి 8 వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు 9న, ఎస్ జి టి లకు 11న బదిలీ అయిన ప్రాంతాల్లో ఉత్తర్వులు అందజేస్తారు. అయితే ఇదంతా ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం సజావుగా జరిగితే ప్రక్రియ ముగిసినట్లు అవుతుంది. అయితే కృష్ణా జిల్లా విద్యాశాఖలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ప్రక్రియ ఒక ఎత్తైతే ఇక్కడ జరిగే ప్రక్రియ వేరు. దీనికి ఉదాహరణే తుది జాబితా ప్రకటన, తాత్కాలిక జాబితాలో దొర్లిన తప్పులపై వందల సంఖ్యలో అభ్యంతరాలు వచ్చాయి. వీటిని సరి చేసి తుది జాబితా ప్రకటించాల్సిన అధికారులు ఇక్కడ అందుకు విరుద్ధంగా జాబితా ప్రకటించినట్లు పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో తప్పులను సరి చేయకుండా విడుదల చేసిన జాబితాలో పెద్ద ఎత్తున అవక తవకల తో కూడిన తప్పులు చోటు చేసుకున్నాయని వారు ఆరోపిస్తున్నారు .ఇది కావాలని చేసినట్లు ఉందని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాపోతున్నారు. దీనివల్ల సీనియర్లు అర్హత కోల్పోయారని జూనియర్లు సీనియర్లుగా జాబితాలో పై స్థానానికి వచ్చారని దీంతో అర్హత ఉన్న ఉపాధ్యాయులు తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందన్నారు వీటిపై విద్యాశాఖ అధికారులకు అభ్యంతరాలు తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావాలని జాబితా ఆలస్యంగా ప్రచురించారని అపవాదు లేకపోలేదు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6వేల మంది ఉపాధ్యాయులు బదిలీ దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటిలో ప్రధానంగా ఎక్కువ తప్పులు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. కావాలనే సీనియర్లకు తక్కువ పాయింట్లు, జూనియర్లకు ఎక్కువ పాయింట్లు కలిపినట్లు అర్థమవుతుందని దీని అంతటికి విద్యాశాఖ అధికారులు, సిబ్బందే కారణమని తెలుస్తోందన్నారు. జాబితాలో దొర్లిన తప్పులను సరిచేయకుండా కౌన్సిలింగ్ నిర్వహిస్తే ఊరుకోబోమని జాబితాలన్నీ పునః పరిశీలించి తప్పులను సరిచేసి తర్వాతే వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



# అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ కేబినెట్ ప్రమాణ స్వీకారం

**ప్రజాశక్తి-భవానీపురం**

అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ క్యాబినెట్ 2023-24 ఇన్‌స్టలేషన్ సమావేశం ఆదివారం భవానీపురం పున్నమి ఘాట్ వద్ద డిస్టిక్ గవర్నర్ జి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఫాస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బి. తిరుపతిరాజు, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ 3 డాక్టర్ డిబిజి శాస్త్రి, ఇంటర్నేషనల్ డైరెక్టర్ కె.రాజేశ్వరరావు, ఇంటర్నేషనల్ అడ్వైజర్ కె. రాజేంద్రప్రసాద్, సౌత్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ పి.వెంకట్రావు హాజరయ్యారు. అనంతరం డిస్టిక్ కేబినెట్‌తో ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 225 సౌత్ క్యాబినెట్ 2023-24 కి డిస్టిక్ గవర్నర్ జి.వెంకటేష్, డిస్టిక్ గవర్నర్ 1 ఎం.చిన్నారావు, డిస్టిక్ గవర్నర్ 2 శ్రీనివాస్ యాదవ్, క్యాబినెట్ సెక్రటరీ అడ్మిన్ రైల్వే శ్రీనివాస్, క్యాబినెట్ సెక్రటరీ యాక్టివిటీ బీఎస్ టి సాయి, ట్రెజరర్ రూరల్ కే ప్రసాద్ రాజు, అర్బన్ ట్రెజరర్ టీ ప్రసాద్ గుప్తా, డిస్టిక్ పి ఆర్ ఓ పోతిన శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌లు రాధిక, రాధా, లలిత రాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

యూఎన్ జనరల్ అసెంబ్లీతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రారంభించబడింది. 100 కంటే ఎక్కువ దేశాలలో వాటాదారులచే విస్తృతంగా జరుపుకునే ప్రజా ఔట్రీచ్ కోసం ప్రపంచ వేదికగా అభివృద్ధి చెందింది. పర్యావరణం కోసం సానుకూలంగా ఏదైనా చేయడం కోసం ఇది ప్రజల దినోత్సవంగా కూడా పనిచేస్తుంది.

**ప్రశ్న:** వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే 2023 (డబ్ల్యుఈడి) థీమ్ వివరించండి?

జవాబు : బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనేది డబ్ల్యుఈడి 2023 థీమ్. ప్రతి ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఒక ఇతివృత్తం చుట్టూ నిర్వహించబడుతోంది. ప్రత్యేకంగా పర్యావరణ ఆందోళనపై దృష్టిని ఆకర్షిస్తోంది. పెరుగుతున్న సంక్షోభాన్ని పరిష్కరించడానికి రాజకీయ సంకల్పం, ప్రభుత్వం తక్షణ చర్యలు అవసరం.

**ప్రశ్న :** సముద్రంలో పారవేసే చెత్త వ్యర్థాలతో ప్లాస్టిక్ శాతం ఎంత ఉంటుంది?

జవాబు : ప్లాస్టిక్ సముద్రపు చెత్తలో అతిపెద్ద, అత్యంత హానికరమైన వ్యర్థాలలో 85 శాతం వాటా కలిగి ఉంటాయి. సముద్రపు లిట్టర్ మన తీరప్రాంతాలు, ఈస్ట్యూరీల వెంబడి పెరుగుతున్న వాల్యూమ్లు, భారీ స్విర్లింగ్ మధ్య సముద్ర ప్రవాహాలు, మారుమూల ద్వీపాలు, సముద్రపు మంచులలో కనిపిస్తుంది. ప్రస్తుతం ఏటా సముద్రంలో చేరుతున్న 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్, వచ్చే ఇరవై ఏళ్లలో మూడు రెట్లు పెరుగుతుందని అంచనా ఉంది. అంటే 2040 నాటికి ప్రతి సంవత్సరం 23 నుండి 37 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ సముద్రాల్లో ప్రవహిస్తుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా సముద్రతీరంలో మీటరుకు 50 కిలోగ్రాముల ప్లాస్టిక్‌తో సమానం.

**ప్రశ్న:** సముద్ర జీవులు, మానవులకు సముద్రపు చెత్త, ప్లాస్టిక్ కాలుష్యంతో కలిగే ముప్పు వివరించండి?

జవాబు : ప్లాస్టిక్ లు జీవఅధోకరణం చెందవు (సహజంగా కుళ్ళిపోవు). అవి మైక్రోప్లాస్టిక్స్, నానోప్లాస్టిక్ చిన్న చిన్న ముక్కలుగా కాలక్రమేణా విచ్ఛిన్నమవుతాయి. ఇవి లెక్కించలేని ప్రతికూల ప్రభావాలను కలిగి ఉంటాయి. సముద్ర జీవులపై భౌతిక, రసాయనిక హాని నుండి జంతువులకు జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థ వరకు పనితీరుపై విస్తృత ప్రభావాలు ఉంటాయి. జలచర జీవులైన సముద్ర తాబేలు, పక్షులు, క్షీరద జాతుల జీర్ణవ్యవస్థలో ప్లాస్టిక్ ముక్కలు కనుగొనబడ్డాయి. సముద్ర జాతులు తినడం వలన విషపూరితం ఆహార గొలుసుతో బదిలీ చేయబడుతుంది. స్థానికేతర జాతులు సముద్రంపై తేలియాడే చెత్తను మట్టి ఆల్గే, మొలస్క్, బార్నాకిల్స్ వంటి సుదూర జల వాతావరణాలను క్షీణింపజేయగలవు. సముద్రంలోని ప్లాస్టిక్ చెత్త చివరికి చెత్త కుప్పలాగా సముద్ర గర్భంలో మునిగిపోతుంది. పగడపు దిబ్బలు, సముద్రపు అడుగున ఉన్న సముద్ర జీవులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

**ప్రశ్న:** మానవాళికి ఎలాంటి ముప్పు పొంచివుంది?

జవాబు : సముద్ర ప్లాస్టిక్ కాలుష్యంతో మనుషులు కూడా ప్రమాదంలో ఉన్నారు. ప్రజలు మైక్రోప్లాస్టిక్‌లను గాలి ద్వారా పీల్చుకుంటూ, ఆహారం, నీటి ద్వారా వాటిని వినియోగిస్తూ, చర్మంతో వాటిని గ్రహిస్తున్నారని కొత్త పరిశోధనలు చెబుతున్నాయి. మైక్రోప్లాస్టిక్లు ఊపిరితిత్తులు, కాలేయాలు, ప్లీహము, మూత్రపిండాల్లో కూడా కనుగొనబడ్డాయి. ఇటీవల ఒక అధ్యయనం నవజాత శిశువుల మావిలో మైక్రోప్లాస్టిక్లను కనుగొంది. ప్లాస్టిక్స్ సంబంధిత రసాయనాలు మిథైల్ మెర్క్యురీ, ప్లాస్టిసైజర్లు, ఫ్లేమ్ రిటార్డెంట్లు వంటివి శరీరంలోకి ప్రవేశించగలవని ముఖ్యంగా ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉన్నాయని చెప్పడానికి గణనీయమైన ఆధారాలు ఉన్నాయి. ప్లాస్టిక్ లో కనిపించే కొన్ని సాధారణ రసాయనాలు, బిస్ఫినాల్ థాలేట్స్, పాలీక్లోరినేటెడ్ బైఫినైల్స్ వంటివి శరీరంలోకి చేరవచ్చని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. ఈ రసాయనాలు ఎండోక్రైన్ అంతరాయం, అభివృద్ధి లోపాలు, పునరుత్పత్తి అసాధారణతలు, క్యాన్సరుతో ముడిపడి ఉన్నాయి.

**ప్రశ్న:** ప్లాస్టిక్ వాతావరణపై ఎలాంటి ప్రభావం చూపుతుంది?

జవాబు : ప్లాస్టిక్ చమురు, శిలాజ ఇంధనం నుండి ఉత్పత్తి చేయబడుతుంది. మనం ఎంత ఎక్కువ ప్లాస్టిక్‌ని తయారుచేస్తే, అంత ఎక్కువ శిలాజ ఇంధనం అవసరమవుతుంది. ప్లాస్టిక్ ఉత్పత్తులు జీవిత చక్రం అంతటా గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను సృష్టిస్తాయి. ఎలాంటి చర్య తీసుకోనట్లయితే మేము వేడెక్కడాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్కు పరిమితం చేసే క్రమంలో పారిస్ ఒప్పందం మొత్తం అనుమతించ దగిన ఉద్గారాలలో 19 శాతం ప్లాస్టిక్ ఉత్పత్తి, రీసైక్లింగ్, భస్మీకరణం నుండి వెలువడే గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలకు కారణం కావచ్చు.

**ప్రశ్న:** బ్రేకింగ్ ది ప్లాస్టిక్ వేవ్‌తో కాలుష్యం నివారించేందుకు పరిష్కారం దొరుకుందని ఆశిస్తున్నారా?

జవాబు : సాంకేతికతలు, పరిష్కారాలను ఉపయోగించినట్లయితే రాబోయే రెండు దశాబ్దాల్లో సముద్రంలోకి ప్రవేశించే ప్లాస్టిక్ మొత్తాన్ని 80 శాతం తగ్గించగలమని వెల్లడైంది. ప్లాస్టిక్ వ్యర్థాలను స్వీకరించడానికి, పునర్వినియోగాన్ని నిర్ధారించడానికి సరైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా వ్యర్థ పదార్థాల నిర్వహణ వ్యవస్థలను మెరుగుపరచుకోవాలి. మొత్తం ప్లాస్టిక్ విలువ గొలుసు అంతటా మరింత స్థిరమైన వినియోగం, ఉత్పత్తి పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా సర్క్యులారిటీని మెరుగుపరచాలి. ప్లాస్టిక్ కాలుష్యాన్ని పరిష్కరించడంలో వినియోగదారులను నిమగ్నం చేయాలి. అనవసరమైన, నివారించ దగిన, అత్యంత సమస్యాత్మకమైన ప్లాస్టిక్ వస్తువులను దశల వారీగా తొలగించడంతో ప్రవాహాన్ని మూసివేయాలి. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ పదార్థాలు, ఉత్పత్తులు, సేవలను అందించాలి.

**ప్రశ్న:** జిల్లాలో తీరప్రాంత నివాసాలు, ప్రత్యక్ష ఆదాయాల కోసం అటవీ శాఖ ప్రణాళికలు చేసిందా?

జవాబు : తీరప్రాంత జీవనం, జీవనోపాధి, మౌలిక సదుపాయాల రక్షణ, స్థితిస్థాపకతను మడఅడవుల చొరవతో మెరుగు పరిచేందుకు మిషన్ మంగ్రోవ్ ఇనీషియేట్ ఫర్ షోర్ లైన్ హ్యాబిటాట్స్ అండ్ టాంజిబుల్ ఇన్కమ్ (మిష్టి) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పర్యావరణ అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ నోడల్ శాఖగా వ్యవహరిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా 5 హెక్టారుల విస్తీర్ణంలో మడ జాతి మొక్కలు పెంపకం నిమిత్తం ఈ రోజు బందరు శివారు గిలకలదిన్నెలో మొక్కలు నాటటం ప్రారంభిస్తాం. గతంలో 160 హెక్టార్లలో ప్లాంటేషన్స్ చేశాం. జిల్లాలో తీరప్రాంతంలో 12 వేల హెక్టార్లలో రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. 8 వేల హెక్టార్లలో మడ అడవులు నిండుగా విస్తరించి ఉన్నాయి. ప్లాంటేషన్స్ చేసే అవకాశం ఉన్న 4 వేల హెక్టార్లలో మడ చెట్లతో గ్యాపులు నింపుతాం. రాబోయే 5 ఏళ్ళలో మడ అడవులను విస్తరింప చేసి తీర ప్రాంత ప్రజలకు జీవనోపాధి కలిపిస్తూ, ప్రకతి వైపరీత్యాలతో ముప్పు వాటిల్లకుండా భావితరాలకు ఉపయోగకరంగా మడ అడవులు అభివృద్ధి జరుగుతుంది.



# వైభవోపేతంగా గిరిప్రదక్షిణ

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో వైభవోపేతంగా దుర్గమ్మ గిరిప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం పౌర్ణమి సందర్భంగా లోకకళ్యాణార్థం శ్రీ కామధేను అమ్మవారి ఆలయం (ఘాట్ రోడ్ ఎంట్రన్స్ వద్ద) వద్ద శ్రీ స్వామి, అమ్మవార్లుకు ఆలయ వైదిక సిబ్బంది పూజలు నిర్విహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, ట్రస్ట్ బోర్డు సభ్యులు గిరిప్రదక్షిణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు బుద్దా రాంబాబు, చింకా శ్రీనివాసరావు, బచ్చు మాధవీకష్ణ, ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, కార్యనిర్వాహక ఇంజినీర్ ఎల్ రమాదేవి పాల్గొన్నారు. దుర్గమ్మను రాష్ట్ర దేవాదాయ కమిషనర్, సెక్రటరీ ఎస్.సత్యనారాయణ దర్శించుకున్నారు.

# గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు : డిఎస్‌సి

**ప్రజాశక్తి-గన్నవటం**

గన్నవరం సబ్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రయించినా, కొనుగోలు చేసిన చట్టపరమైన చర్యలు తప్పబోవని డిఎస్ పి జయసూర్య హెచ్చరించారు. ఉంగుటూరు మండలం అక్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న ముఠాని పోలీసులు పట్టుకున్న వివరాలు అత్కూరు పోలీస్ స్టేషన్ లో తెలిపారు. గన్నవరం మండలం చిన్నఅవుటపల్లి వద్ద నర్సీపట్నం నుండి విజయవాడకు కారులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో అత్కూరు ఎస్ఐ సూర్య శ్రీనివాస్ బృందం వాహనాలు తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో కారులో గంజాయి తరలిస్తున్నట్లు అనుమానం వచ్చిన పోలీసులు సోదా చేయగా, కారులో 50 కేజీల గంజాయిని గుర్తించారన్నారు. కారులో డ్రైవర్ తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసికొని స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు అనకాపల్లి జిల్లాకు చెందిన పేరూరు వెంకటేష్, చిటికెల సత్య శేఖర్, కాగా మరో వ్యక్తి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు శివాలయం మూడవ రోడ్డుకు చెందిన షేక్ బాజిగా గుర్తించామన్నారు. గంజాయి తరలింపులో విజయవాడకు చెందిన ఓ మహిళతో పాటు మరికొందరు ఉన్నట్లు గుర్తించామన్నారు. హనుమాన్ జంక్షన్ సిఐ నరసింహ మూర్తి నేతృత్వంలో కేసు దర్యాప్తు జరుగుతుందన్నారు. గంజాయి తరలింపులో ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని డిఎస్పీ తెలిపారు. గన్నవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడి విక్రయాలు, కొనుగోలు వంటివి జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈకేసులో చాకచక్యంగా గంజాయిని పట్టుకున్న ఎస్ఐ సూర్య శ్రీనివాస్ బృందాన్ని ఎస్పీ జాషువా తరపున అభినందిస్తున్నామన్నారు. ఎస్ ఐ సూర్య శ్రీనివాస్ తో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లకు డిఎస్పీ జయసూర్య . చేతులు మీదుగా రివార్డులు అందజేశారు.



## ఘనంగా పునీత కార్మిక జోసెఫ్ పండుగ

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు**

స్థానిక ఆర్‌సిఎం చర్చి వద్ద ఆదివారం రాత్రి పునీత కార్మిక జోసెఫ్ పండుగ ఘనంగా నిర్వహించారు. విజయవాడ పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు ముఖ్యఅతిథిగా



పాల్గొన్నారు. ఈ పండుగకు మండలంలోని 22 గ్రామాల్లోని సంఘాల నుండి విశ్వాసులు పాల్గొన్నారు జోసఫ్ రాజారావు ప్రత్యేక ఉపన్యాసంలో మానవులు మంచి మార్గంలో నడవాలంటే ఏసుప్రభు పొందిపర్చిన సూత్రాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ ఎం.నిరాకల్, ఉపదేశికులు, సంఘ పెద్దలు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : జోగి

**ప్రజాశక్తి-పెడన**

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నిరంతరం ప్రజా సేవ, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. బంటుమిల్లి మండలం కొర్లపాడు గ్రామ వైసీపీ నాయకులు చేబోయిన సముద్రయ్య కుమార్తె వివాహం జరగనుంది. నూతన వధువుకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జోగి రమేష్ నాయకులతో మాట్లాడారు. పెడన నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతమయ్యేలా కృషిచేయాలని కోరారు. సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి అందేలా ఎంపిక జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**మొవ్వ :** వేసవి ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మొవ్వ మండల అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం కూచిపూడి సెంటర్లో మజ్జిగ పంపిణీ చేశారు. జడ్పీ కో ఆప్షన్ సభ్యులు, దైవసేవకులు వేమూరి పరిశుద్ధరాజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సెంటర్లోని డా బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. వేసవి ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు, ప్రయాణికులకు చల్లటి త్రాగునీరు, మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు నాయకుడు దగాని సంగీతరావు, పలువురు అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## కోనేరులో బయటపడ్డ శివలింగం

**ప్రజాశక్తి- నందిగామ :** నందిగామ కోనేరులో శివలింగం బయటపడింది.. గత పది సంవత్సరాలుగా ఆక్రమణలకు గురై ఎటువంటి పూజలకు నోచుకోని కోనేరు వద్ద శివలింగం ఉన్నది. రామలింగేశ్వర స్వామి ఈవో సుబ్రహ్మణ్యం కృషితో ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణలు తొలగించడంతో శివలింగం బయట పడింది.

## వ్యవసాయానికి అధిక నిధులు కేటాయించాలి

**ప్రజాశక్తి-బంటుమిల్లి**

రానున్న వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందించటానికి అత్యధిక నిధులు కేటాయించాలని ఎపి రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బంటుమిల్లి మండలంలో ఆదివారంనాడు ఆయన ఏరువాకను ప్రారంభించారు. ఈ



దుక్కిదున్నుతున్న గౌరిశెట్టి నాగేశ్వరరావు తదితరులు

సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల రుణాలు మాఫీ చేయాలనీ, కొత్తగా రుణాలు మంజూరు చేయాలనీ, నాణ్యమైన విత్తనాలు ఎరువులు 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. పంట, మురుగు కాలువల తవ్వకాలు, మరమ్మతు పనులు పూర్తిచేయాలని కోరారు. రైతు సంఘం బంటుమిల్లి మండల కార్యదర్శి అజయ్ ఘోష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాజుల నాగరాజు, తలారి నాంచారయ్య ,సుంకర వెంకన్న గౌరిశెట్టి రమేష్ ,సుంకర నాగమల్లేశ్వరరావు,నాగిశెట్టి చంద్రశేఖర్, బొడ్డు నాగరాజు, యలవర్తి కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

## గంగానమ్మ దేవాలయం ప్రారంభం

**ప్రజాశక్తి-పెదపారుపూడి**

పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామంలో గంగానమ్మ నూతన దేవాలయాన్ని గ్రామస్తుల సహకారంతో నిర్మించి శనివారం విగ్రహ ప్రతిష్ట చేశామని టిడిపి మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబులు తెలిపారు. టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సూరపనేని వెంకట సత్యనారాయణ, నాయకులు చెరుకూరి విజయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం సుమారు 5000 మందికి అన్నదానం జరిగింది.



పూజల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

# జీలుగ సాగుతో పంటలకు ఎంతోమేలు

### పమిడిముక్కల మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి

**ప్రజాశక్తి-పమిడిముక్కల**

మండల పరిధిలోని రైతులకు రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్‌బికె) జీలుగ, వరి విత్తనాలు పంపిణీచేయటానికి సిద్ధంగా ఉన్నాయని పమిడిముక్కల మండల వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి చెప్పారు. ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పమిడిముక్కల మండల పరిధిలోని లంకపల్లి, మంటాడ, తాడంకి, అగినపర్రు కేంద్రాల్లో రైతులు, కౌలు రైతులు ఆధార కార్డు, పొలం పాస్ బుక్ తీసుకొని వెళ్లి విత్తనాలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. జనుము, జీలుగ విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు జీలుగ సాగు చేస్తే చక్కటి ఫలితాలు సాధించొచ్చునన్నారు.



తక్కువ సారవంతమైన భూముల్లో నల్లటి మట్టిని వేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. పచ్చిరొట్టె ఎరువుల సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చున్నారు. నేల స్వభావాన్ని బట్టి జీలుగను సాగు చేసుకుంటే తర్వాత వేసే పంటలకు అనుకూలంగా ఉంటుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల కోసం నిర్దేశించిన మొక్కలను పొలంలో కలియదున్నడంతో అవి కుళ్లి మొక్కలకు సారవంతమైన పోషకాలు అందిస్తాయన్నారు. జీలుగ విత్తనాలు నాటిన 30 నుంచి 35 రోజుల్లోనే ఏపుగా పెరుగుతాయన్నారు. దుక్కిలో 30 కిలోల యూరియా వేసిన తర్వాత ఎకరానికి 12 కిలోల జీలుగ విత్తనాలు చల్లుకోవాలన్నారు. మొక్కలు బాగా పెరిగేందుకు క్రమపద్ధతిలో ఉండే విధంగా చూడాలన్నారు. జీలుగను సాగు చేసిన తర్వాత 30 రోజుల్లో ఏపుగా పెరిగి పూతదశకు చేరుకుంటుందన్నారు. ఆ సమయంలో మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలన్నారు. లేనిపక్షంలో రొటోవేటర్ సాయంతో పొలం అంతా కలియదున్నాలన్నారు. దున్నిన అనంతరం 100 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్‌ను దుక్కిలో వేయాలన్నారు. సూపర్ పాస్ఫేట్ వల్ల మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్ట ఎరువుగా తయారవుతుందన్నారు. పొలంలో జీలుగ కుళ్లేదశలో నీటిని సక్రమంగా అందించాలన్నారు. పొలంలో జీలుగను కలియదున్నిన తర్వాత అవి నేలకు, తర్వాత వేసే పంటలకు విశేషమైన లాభాలు అందిస్తుందన్నారు. ప్రధాన పంటకు ముందస్తుగా నేలను తయారు చేస్తుందన్నారు. జీలుగ సాగుతో మూడు టన్నుల పచ్చిరొట్టె ఎరువు లభిస్తుందన్నారు. మొక్కలకు 2శాతం నత్రజని, సూపర్ పాస్ఫేట్‌ను అదనంగా అందిస్తాయన్నారు. జింక్ మాంగనీస్, ఇనుము, క్యాల్షియం వంటి సూక్ష్మధాతువులను పంటకు చేకూర్చుతాయన్నారు. నేలపై కరగని మూలకాలను పంటకు అనుకులంగా మార్చుతాయన్నారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని అధికంగా పెంచుతుందనీ, నేల సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయన్నారు. లెగ్యూజాతికి చెందిన మొక్కకావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుందన్నారు. వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గణేష్‌రెడ్డి కోరారు.



## ఉత్సాహభరితంగా అండర్-19 చెస్ టోర్నీ

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** పొరంకిలోని గ్రీన్ స్కూల్‌లో ఆదివారం జరిగిన కృష్ణాజిల్లా అండర్ -19 చెస్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో బి.రుషిల్ సాయి, బాలికల విభాగంలో శివ శరణ్య నాయుడు విజేతగా నిలిచాడని ఈటోర్నమెంట్‌లో బాలుర విభాగంలో 24 మంది విద్యార్థులు పాల్గొనగా 5 పాయింట్లకుగాను రుషిల్ సాయి బి. 5 పాయింట్లు సాధించి ప్రథమ స్థానం, కె.సందీప్ 4 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానం, అబ్దుల్ ఫయాజ్ మూడవ స్థానం, ఎం.ఆదిత్య నాల్గవ స్థానం సాధించారు. బాలికల విభాగంలో శివ శరణ్య నాయుడు, గీతా మాధురి, జాయ్ ప్రహస్త, నవ్య శ్రీ వరుసగా మొదటి నాలుగు స్థానాలు సాధించారు. బాలుర విభాగంలో మొదటి నలుగురు విజేతలు ఈనెల 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు నంద్యాలలో జరుగనున్న అండర్ -19 బాలుర చెస్ పోటీల్లో పాల్గొంటారని కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ యన్.యం.ఫణికుమార్ తెలిపారు. బాలికల విభాగంలో విజేతలు ఈనెల 15వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో కృష్ణాజిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో యస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమి అధ్యక్షులు జాస్తి సౌజన్య, డాక్టర్ యర్రంశెట్టి రమ్య పాల్గొన్నారు.

## నేడు వెంకటసుబ్బమ్మ సంస్మరణ కార్యక్రమం

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు:** సుధీర్ టింబర్ డిపో అధినేత, రాష్ట్ర ఉత్తమ పారిశ్రామికవేత్త అవార్డు గ్రహీత నూకల లింగమూర్తి



సతీమణి నూకల వెంకటసుబ్బమ్మ మే 26న తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆమె సంస్మరణ కార్యక్రమాన్ని సోమవారంనాడు యాకమూరు (తోట్లవల్లూరురోడ్డు, ఉయ్యూరు కాలేజి వెనుక)లోని తమ స్వగృహం వద్ద నిర్వహిస్తున్నామని భర్త నూకల లింగమూర్తి, కుమారులు నూకల లింగమూర్తి, సాంబశివరావు తెలిపారు. మండలంలోని యాకమూరు గ్రామానికి చెందిన నూకల లింగమూర్తి ధర్మ పత్ని కావటంతో పలువురు ప్రముఖులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాము జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించటానికి, జీవిత వైభవాన్ని పెంపొందింటానికి తమ తల్లి వెంకటసుబ్బమ్మ కృషి చేశారని కుమారులు పేర్కొన్నారు.

## గాంధీనాగరాజన్ దీక్ష భగ్నం

**ప్రజాశక్తి-భవానీపురం:** ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఊర్మిళానగర్‌లో గత రెండు రోజులుగా గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ చేస్తున్న దీక్షను భవానీపురం సిఐ సలాం నేతృత్వంలో పోలీసులు భగ్నం చేశారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గాంధీనాగరాజన్‌ను పోలీసులు అరెస్టు చేసి అంబులెన్సులో



బలవంతంగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన్ను ఆసుపత్రికి తరలించిన వెంటనే దీక్షా శిబిరం కోసం ఏర్పాటు చేసుకున్న టెంట్‌ను పోలీసులు తొలగించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆమరణ దీక్షకు అధికారులను అనుమతి కోరినా ఇవ్వకపోవటంతో తన ట్రస్టు కార్యాలయం వద్ద ఆమరణ నిరశన దీక్ష చేస్తే పోలీసులు విచక్షణా రహితంగా వ్యవహరించటంపై గాంధీ నాగరాజన్ మండిపడ్డారు. గాంధీ నాగరాజన్‌ను సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు, జి.వెంకట్రావు ఆసుపత్రిలో పరామర్శించారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమరణ దీక్షకు తాత్కాలికంగా విరామం ఇచ్చి ప్రజా క్షేత్రంలో ప్రజా చైతన్యం పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించాలని వారు సూచించారు.

# గుండె వ్యాధులపై అప్రమత్తత అవసరం

### డాక్టర్ శివప్రసాద్ హృదయాలయ అధినేత శివప్రసాద్

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** గుండె వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రఖ్యాత గుండె శస్త్రచికిత్స నిపుణులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఎ.గోపాలకృష్ణ గోఖలే అన్నారు. నగరంలో నూతనంగా నెలకొల్పిన డాక్టర్ శివప్రసాద్ హృదయాలయాను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, గద్దె రామ్మోహన్ రావు, వైసీపీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జి దేవినేని అవినాష్, నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ గోఖలే మాట్లాడుతూ గుండెపోటు లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్య చికిత్స తీసుకోవాలన్నారు. గుండెపోటు వచ్చిన అనంతరం మొదటి మూడు గంటల సమయం అత్యంత కీలకమైనదని, తొలి గంట వ్యవధిలో చికిత్స అందిస్తే మెరుగైన ఫలితాలను సాధించవచ్చని చెప్పారు. అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, అత్యాధునిక సాంకేతిక వసతులతో శివప్రసాద్ హదయాలను స్థాపించడం అభినందనీయమని ప్రశంసించారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.వి.శివప్రసాద్ మాట్లాడుతూ గడిచిన 18 సంవత్సరాలుగా కోస్తాంధ్ర ప్రజలకు మెరుగైన హృద్రోగ చికిత్సలను అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 20 వేలకు పైగా క్యాథ్ ప్రొసీజర్లు, ఆరువేలకు పైగా ఓపెన్ హార్ట్ సర్జరీలు, సంక్లిష్టమైన యాంజియోప్లాస్టీలు, బైపాస్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించామని అన్నారు. మొత్తం 60 మంది బృందంతో నిరంతర వైద్య సేవలను




అందిస్తున్నామని వివరించారు. స్టెంట్లను అమర్చేందుకు తమ హాస్పిటల్లో ప్రత్యేకమైన ఓసీటీ మెషీన్ అందుబాటులో ఉందన్నారు. క్రిటికల్ కేర్ విభాగంలో డాక్టర్ జస్వంత్ చౌదరి, సర్జన్లు డాక్టర్ ప్రశాంత్ ప్రభు, డాక్టర్ దిలీప్ తదితర అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు సేవలందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాస్మోటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ ఎన్.ఆర్. శిరీష, బ్లూ బెల్ ఎండీ ఘంటా శివ సీతారాం, విటెస్కో టెక్నాలజీ ఎస్ఎపీ కన్సల్టెంట్ ఎన్.వినయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలి

### పీపుల్స్ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరక్టర్ రవీంద్ర



మాట్లాడుతున్న పీపుల్స్ కో- ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ రవీంద్ర

**ప్రజాశక్తి-విజయవాడఅర్బన్:** పిల్లల్లో అద్భుతమైన శక్తి సామర్థ్యాలు ఉంటాయని, వాటిని ప్రోత్సహించాలని పీపుల్స్ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ రవీంద్ర అన్నారు. ఆదివారం పటమట లంక రామాలయం సెంటర్లోని బొబ్బ వెంకటేశ్వరరావు భవన్లో జరిగిన లెక్కలు సమ్మర్ కోచింగ్ ముగింపు సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు ప్రతిభలో ఎవరినీ తీసిపోరు అన్నారు. వారికి సరైన గైడెన్స్, అవకాశాలు కల్పిస్తే అందరికంటే ముందుంటారనీ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల యొక్క ఆసక్తిని గమనించాలనీ,. వారిని ప్రోత్సహించాలన్నారు.. మనకు చేతనైనంతలో వారికి కావాల్సిన వాటిని అందిస్తే ఉత్సాహంగా వాళ్లు ఆ రంగాల్లో ముందుంటారనీ అన్నారు. పదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు లెక్కలు అత్యంత కీలకమైనది అన్నారు.. లెక్కల శిక్షణను ఏర్పాటు చేసిన అమరావతి బాలోత్సవం, డివైఎఫ్ఐ కమిటీలకు ధన్యవాదాలు తెలిపారు. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి మురళీకష్ణ మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం పిల్లలు, విద్యార్థులు, మహిళలు, యువకులకు వివిధ తరగతులుగా మ్యాజిక్ సమ్మర్ కోచింగ్, కంప్యూటర్ ట్రైనింగ్, టైలరింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ లాంటి వివిధ శిక్షణ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. తల్లిదండ్రులు పెద్దలు ప్రోత్సహిస్తే ఈ శిక్షణ సేవా కార్యక్రమాలను మరింత విస్తతం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. పిల్లలు ఖాళీగా వుంటే సెల్ ఫోన్ కి బానిసలు అవుతున్న నేటి తరుణంలో వేసవి శిక్షణలు ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చిన మ్యాథ్స్ లెక్చరర్ డాక్టర్ ఎస్ లెనిన్ బాబు, డివైఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు పి కృష్ణ సందేశాలు ఇచ్చారు. అమరావతి బాలోత్సవం కార్యదర్శి యువి రామరాజు అధ్యక్షత వహించారు. నెలరోజుల శిక్షణకు నిరంతరం సహకరించిన నోహిత్ కష్ణ, మల్లికార్జున రావులు సభలో పాల్గొన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో నెలరోజుల శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీలు ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు.



## 50 రోజుల పాటు మజ్జిగ పంపిణీ

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** మండుతున్న ఎండలకు బాటసారుల దాహార్తిని తీర్చటానికి వాసవీ క్లబ్ ఆదర్శ మహిళ ఆధ్వర్యంలో గత 50 రోజులుగా వన్‌టౌన్ బ్రాహ్మణ వీధి సమీపంలో మజ్జిగను పంపిణీ చేసి వితరణ చాటుకున్నారు. ఈ సందర్భంగా శనివారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం 50వ రోజు పూర్తిచేసుకుంది. వాసవి క్లబ్ ఐపిసి ఆతుకూరి శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ బచ్చు కోటేశ్వరరావు తాత బచ్చు కోటయ్య జ్ఞాపకార్థం గత 50 రోజులుగా వాసవి క్లబ్ ఆదర్శ మహిళలు ముందుకు వచ్చి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అద్యక్షులు గ్రంధి రాజేశ్వరి, కోశాధికారి డి. కవిత, సెక్రటరీ బి. కవిత తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ అయినప్పటికీ ఐఎఎస్‌పైనే దృష్టి

### సివిల్స్ ఆలిండియా 22వ ర్యాంకర్ పవన్ దత్త




**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** తాను డాక్టర్ అయినప్పటికీ ఐఎఎస్ అధికారిగా మంచి సేవలు అందించగలననే దృఢ సంకల్పంతో కష్టపడి, ప్రణాళికా బద్ధంగా చదివానని అందుకే ఆలిండియా ర్యాంకు సాధించానని కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే సివిల్స్‌లో విజయం సాధించడం సులువు అని యుపిఎస్‌సి సివిల్స్ సర్వీసెస్ ఆలిండియా 22వ ర్యాంకర్ పవన్ దత్త అన్నారు. ఎం.జి.రోడ్డులోని శరత్‌చంద్ర ఐఎఎస్ అకాడమి నందు ఆదివారం విద్యార్థులతో సివిల్స్ 22వ ర్యాంకర్ పవన్‌సాయి దత్త ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈసందర్భంగా ఐఎస్ ర్యాంకర్ పవర్ దత్త మాట్లాడుతూ మనం సాధించాలనుకునే కలలను కని, ఇష్టంతో చదివితే సివిల్స్ తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించవచ్చని తెలిపారు. తాను డాక్టర్ అయినప్పటికీ ప్రభుత్వ అధికారిగా అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూ పేద ప్రజలకు ఇంకా ఎక్కువ సేవ చేయాలనే ఉద్దేశంతోనే సివిల్స్‌లో ర్యాంకు సాధించాలనే లక్ష్యంతో కృషి చేసినట్లు తెలిపారు. తనకు ఆలిండియా 22వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అలాగే విద్యార్థులు ఎవరికైనా సివిల్స్ చదవాలనే ఆసక్తి ఉంటే వెనుకడుగు వేయవద్దని ఖచ్చితంగా ర్యాంకు సాధించగలమని, ఆవిధంగా విద్యార్థులు ముందడుగు వేయాలన్నారు. తెలుగు మీడియంలో చదవడం వలన సివిల్స్‌లో ర్యాంకు సాధించలేమని అనుకుంటారని అదంతా అపోహేనని, కష్టపడితే తప్పకుండా సివిల్స్ సాధిస్తామని యువత ఆవిధంగా ముందడుగు వేయాలన్నారు. శరత్ చంద్ర ఐఎఎస్ అకాకమి మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర మాట్లాడుతూ 2021లో కోవిడ్ వలన కొన్ని నెలలు ప్రిపరేషన్‌లో వృధా అయినప్పటికీ మనోధైర్యంతో పవన్ దత్త ఆరు నెలలు మాత్రమే కష్టపడినప్పటికీ ఐఎఎస్ ర్యాంకు సాధించాడన్నారు. పవన్ దత్తను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు కష్టపడితే ఖచ్చితంగా ఐఎఎస్ కాగలరని అన్నారు. నిజానికి డాక్టర్ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంతో మందికి సేవ చేవచ్చని అన్నారు. అంతకంటే గొప్ప స్థాయిలో సేవ అందించాలనే లక్ష్యంతో ఐఎఎస్‌కు సిద్ధమై ర్యాంకు సాధించడం అభినందనీయమని తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి ఆకట్టుకున్నారు.